
4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 26 సెప్టెంబర్ 2024
www.ntnews.com



‘ఈ భూమి నాది, పండించిన పంట నాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు?’
- చాకలి ఐలమ్మ

చాకలి ఐలమ్మ జయంతి నేడు



నమస్తే తెలంగాణ

## దళితులపై దాడులు

**దేశంలో** దళితులపై దాడులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. రాజ్యాంగ రక్షణలు, రాజకీయ ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ అట్టడుగువర్గాల ప్రజలపై కుల వివక్ష, హింస తగ్గకపోగా అంతకంతకు పెరుగుతుండటం గమనార్హం. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) తాజాగా విడుదల చేసిన 2022 నివేదిక ఈ విషయాన్నే ఎత్తిచూపింది. మొత్తం నమోదైన కేసుల సంఖ్య 51,656కు పెరిగింది. 2021తో పోలిస్తే ఇది 13 శాతం అధికం. ఇందులో సుమారు 98 శాతం కేసులు 13 రాష్ట్రాలకు చెందినవే. ఉత్తరాదికి చెందిన యూపీలో 12,287 (23.78%), రాజస్థాన్‌లో 8,651 (16.75%), మధ్యప్రదేశ్‌లో 7,732 (14.97%) కేసులు నమోదైనట్టు ఆ నివేదిక వెల్లడించింది. బీహార్, ఒడిశా, మహారాష్ట్ర తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మొత్తం కేసుల్లో ఈ ఆరు రాష్ట్రాల వాటా 81 శాతం వరకు ఉంటుంది. గత జూలైలో ఈ అంశంపై సామాజిక న్యాయశాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే పార్లమెంటులో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు ఒక్కటే పరిష్కారమన్నారు. కానీ, అత్యధిక కేసులున్న 14 రాష్ట్రాల్లో 498 జిల్లాలుంటే 194 జిల్లాల్లోనే ప్రత్యేక న్యాయస్థానాలున్నాయి. అత్యధిక కేసులు నమోదైన యూపీలో ఎస్సీలపై అత్యాచారాలు జరిగే ప్రాంతాల గుర్తింపే జరగలేదు.

దళిత బహుజనుల అభ్యున్నతికి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని బాకాలూదుకునే పార్టీల పాలనలో ఏండ్ల తరబడి కొనసాగిన రాష్ట్రాల్లో ఎస్సీలపై అత్యాచారాలు అత్యధిక స్థాయిలో నమోదు కావడం గమనార్హం. తూతూమంత్రం చందంగానే దళితుల క్షేమం, సంక్షేమం అక్కడ అమలవుతుండటమే ఇందుకు కారణం. నిచ్చెనమెట్ల కులవ్యవస్థను నడిపించే ఆధిపత్య భావజాలం వెర్రితలలు వేయడంపై అనునిత్యం వార్తలు వెలువడుతూనే ఉంటాయి. దళిత పెండ్లికొడుకు గుర్రం మీద ఊరేగరాదని, దళితులు చెప్పులు వేసుకుని వీధుల్లో తిరగొద్దని, మీసాలు పెంచొద్దని, తలపాగాలు పెట్టుకోవద్దని హుకుం జారీ చేసే సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతుండటం సభ్య సమాజానికి తలవంపులు తెస్తున్నది. ఈ ఆధిపత్య భావజాలమే అంతిమంగా దాడులకు దారితీస్తున్నది. ఇలాంటివి జరిగినప్పుడు పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పనితీరు సందేహాస్పదం అవుతుంటుంది. నమోదయ్యే కేసుల్లో 61 శాతం మాత్రమే చార్జిషీటు దాకా వెళ్లడం ఇందుకు ఉదాహరణ.

దళితులపై అత్యాచారాల నివారణకు బహుముఖ, దీర్ఘకాలిక వ్యూహం అనుసరించాల్సిన అవసరం ఉందని చెప్పకతప్పదు. సామాజిక నిర్మాణాన్ని సమూలంగా మార్చడమూ తప్పనిసరి. సమాజానికి న్యాయం ప్రాముఖ్యతను వివరించేందుకు పటిష్ఠమైన ప్రచారోద్యమం ఏదీ లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కులవివక్షకు వ్యతిరేకంగా బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించేలా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు జాతీయ స్థాయిలో కృషి జరగాలి. బడులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో ఈ అంశానికి ప్రాధాన్యమివ్వాలి. చట్టాలకు ప్రజా చైతన్యం తోడైనప్పుడే దళితులపై అత్యాచారాలు, దాడులను రూపుమాపడం సాధ్యపడుతుంది.

# శ్రీలంకను దిస్సనాయకే గట్టెక్కించేనా?

**శ్రీలంక అధ్యక్షుడిగా 55 ఏండ్ల అనూరకుమార దిస్సనాయకే ఎన్నిక కావడం ఈ ద్వీపదేశంలో మార్పులకు సంకేతం. 2008 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ‘ఆశమార్పు’ అనే మాటలు ఆఫ్రికన్-అమెరికన్ జూనియర్ సెనెటర్ బరాక్ ఒబామాకు ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పదవిని కట్టబెట్టాయి. అలాగే ఆర్థిక వ్యవస్థ తునాతునకలై దివాలా మార్గంలో పయనిస్తున్న లంకను ఒడ్డున చేర్చే శక్తి అనూరకు ఉందనే ఆశ, పాలనలో పరివర్తన వస్తుందనే అంచనాలు లంక అధ్యక్ష ఎన్నికల్లో చారిత్రక ఫలితానికి నాంది పలికాయి.**

**అనూర నాయకత్వంలో జనతా విముక్తి పెరమునా (జేవీపీ) అధ్యక్ష పీఠం ఎక్కడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు కొన్ని రాజకీయ పార్టీలు, కొన్ని కులీన కుటుంబాలకు చెందిన నేతలే దేశాధ్యక్ష, ప్రధానమంత్రి తదితర ఉన్నత పదవులను చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన తొలితరం నాయకుడు అనూర అధ్యక్ష పీఠమెక్కడం విశేషం.**



నాంచారయ్య మెరుగుమాల

లంకలోని సెంట్రల్ ప్రావిన్స్‌లో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న ఓ కుటుంబంలో అనూర జన్మించారు. అతని తండ్రి ప్రభుత్వ చిరుద్యోగి. అనూర చదువుకున్న పాఠశాల నుంచి యూనివర్సిటీలో అడుగుపెట్టిన తొలి విద్యార్థి కూడా ఆయనే కావడం గమనార్హం. ఈ తరుణంలో విద్యార్థి దశ నుంచే తన రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టిన అనూర అంచెలంచెలుగా ఎదిగి దేశంలోని అత్యున్నత పీఠాన్ని అధిరోహించారు.

మార్క్సిజం కరదీపికగా ఆరంభమైన జేవీపీ తన తీవ్రవాద, హింసాత్మక గతం నుంచి, రాడికల్ ఇమేజ్ నుంచి నెమ్మదిగా బయటపడింది. 1994 తర్వాత ప్రధాన స్రవంతి పార్లమెంటరీ పార్టీగా అవతరించింది. 1970ల ఆరంభంలో, 1980ల్లో ప్రభుత్వంతో, రాజకీయ ప్రత్యర్థులతో హింసామార్గంలో తలపడి వేలాది మంది కార్యకర్తలను ఆ పార్టీ కోల్పోయింది. మార్క్సిస్టు సిద్ధాంతాలకు కట్టుబడిన విప్లవ సంస్థగా రాజకీయ పోరాటం ప్రారంభించి, మధ్యలో మెజారిటీ సింహళ జాతీయవాదానికి మరో ప్రతినిధిగా మారి బలపడింది. ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోని తమిళుల ఈలం డిమాండ్ వల్ల వచ్చిన అంతర్యుద్ధం ఫలితంగా జేవీపీ మెజారిటీ సింహళ ప్రయోజనాలు కాపాడే సంస్థగా ఉంటూనే శ్రామికవర్గం తరపున పోరాడే మార్క్సిస్టు పార్టీగా తన పేరును నిలబెట్టుకోగలిగింది. ఈ క్రమంలో వ్యథాభరిత ప్రయాణంతోనే దాదాపు ఏడున్నర దశాబ్దాల తర్వాత అధ్యక్ష పీఠాన్ని జేవీపీ కైవసం చేసుకోగలిగింది. మార్క్సిస్టులు తమ విశ్లేషణ సామర్థ్యంతో భవిష్యత్తులోకి తొంగిచూడడంలో నిష్ణాతులని పేరు గడించారు. అందుకేనేమో 1960 చివర్లో లంక రాజకీయ క్షేత్రంలోకి అడుగిడిన జేవీపీ హింసామార్గంలో నడిచి నష్టపోయింది. భారీ ప్రాణనష్టంతో పాటు పార్టీ నేతలూ జైలుపాలయ్యారు. 1970ల ఆరంభంలో ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో శ్రీలంక గతాన్ని, భవిష్యత్తునూ జేవీపీ తన విధాన పత్రంలో చక్కగా అంచనా వేసింది.

‘1948లో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక ఒకదాని తర్వాత ఒకటిగా అధికారం చేపట్టిన బూర్జువా పార్టీలు పెట్టుబడిదారీ అభివృద్ధి అనే దివాలాకోరు పంథాను క్రమం తప్పకుండా అనుసరించాయి. ప్రజాతంత్ర సామ్యవాదం, సామ్యవాద ప్రజాస్వామ్యం అనే ముసుగులో ఇదంతా సాగింది. ఫలితంగా నేడు శ్రామికవర్గంపై పెరుగుతున్న అణచివేత, దేశవ్యాప్తంగా నిరుద్యోగం, మైనారిటీల హక్కులను కాలరాయడం, మనుషులుగా స్త్రీలకు కనీస హోదా దక్కకపోవడం లాంటి ఎన్నో దారుణాలను చూస్తున్నాం’ అని 1970ల ఆరంభంలో జేవీపీ నేతలు నిర్బంధంలో ఉండి రూపొందించిన పార్టీ విధాన ప్రకటనలో విశ్లేషించారు. లంకకు స్వాతంత్ర్యానంతరం పాతికేండ్లలో దిగజారిన నాటి పరిస్థితులు ఐదు దశాబ్దాల తర్వాత 2022 నాటికి మరింత క్షీణించాయి. దేశాధ్యక్షుడు గొటబయా రాజపక్స పదవీచ్యుతుడు కావడానికి అవి దారితీశాయి. అధ్యక్ష భవనంపై దాడికి ప్రజలు ఉవ్వెత్తున కదిలారు. ఈ సంక్షుభిత సమయంలో ప్రజాందోళనకు అనూర దిస్సనాయకే సారథ్యంలోని జేవీపీ నాయకత్వం వహించడమే గాక, అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించడం గొప్ప చారిత్రక పరిణామం. గత అధ్యక్ష ఎన్నికల్లో 3.8 శాతం ఓట్లు సాధించిన



పార్టీని ఐదేండ్లలో విజయపథంలో నడిపించడం అనూర నాయకత్వ సామర్థ్యానికి, రాజకీయ పరిణతికి తార్కాణం.

> **మధ్య ప్రావిన్స్‌లోని గలెవెలా అనే కుగ్రామంలో 1968 నవంబర్ 24న పుట్టిన అనూర.. 1992లో కొలంబో సమీపంలోని కెలానియా యూనివర్సిటీలో తన రాజకీయ భవిష్యత్తుకు పునాది వేసుకున్నారు. ఆ పునాదే నేడు అత్యున్నత పదవిని అధిష్ఠించడానికి తోడ్పడింది. 1997 నుంచి వరుసగా ఆయనకు పార్టీలో దక్కిన పదవులు జేవీపీని సక్రమ మార్గంలో నడిపించడానికి దోహదపడ్డాయి.**

మొదట సెంట్రల్ ప్రావిన్షియల్ ఎన్నికల్లో ఓటమి పాలైన అనూర ఆ తర్వాత రెండేండ్లకే 2000లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో కూడా గెలిచి, శ్రీలంక ఫ్రీడం పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ సర్కారులో వ్యవసాయం, పశుసంవర్ధకం, భూములు, సాగునీటిపారుదల శాఖల మంత్రిగా పనిచేసిన ఆయన పరిపాలనా దక్షునిగా నిరూపించుకున్నారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలు, గ్రామీణాభివృద్ధిపై విస్తృత చర్చకు కారకుడయ్యారు.

అనూర పాలనపై శ్రీలంకలో ఎన్నో అనుమానాలు, సంశయాలు, భయాలు వ్యక్తమవుతున్నాయి. హింసామార్గంలో దశాబ్దాల పాటు పయనించిన రాజకీయ సంస్థగా జేవీపీకి ఉన్న ఇమేజ్, ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలే ఈ అనుమానాలకు కారణం. అంతేగాక, సింహళ జాతీయవాద పక్షంగా ఎదిగిన దాని నేపథ్యం కూడా లంక తమిళుల సమస్య శాశ్వత పరిష్కారానికి అడ్డంకిగా మారుతుందని, హిందూమహాసముద్ర ప్రాంతంలోని ఇతర చిన్న దేశాల మాదిరిగానే శ్రీలంక కూడా జేవీపీ పాలనలో చైనాకు మరింత దగ్గరవుతుందని, ఇండియాతో గతంలో తలెత్తిన వివాదాలు మరింత ముదిరిపోతాయనే అంచనాలు కూడా ఇప్పుడు ప్రచారంలోకి వస్తున్నాయి. అసలు శ్రీలంక ఆర్థిక వ్యవస్థను ఊహించనలవికాని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసిన అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) షరతుల అమలును కొత్త సర్కారు ఎలా మార్చగలుతుందనే ప్రశ్న అన్నిటికన్నా ముఖ్యమైనది. దేశాధ్యక్షుడిగా ప్రమాణం చేసే సమయంలో చెప్పిన మాటలు, తర్వాత ఎక్స్ ద్వారా ఇచ్చిన పిలుపు దేశ ప్రజలను వ్యాపార, వాణిజ్య వర్గాల భయాలను పోగొట్టేవిగా ఉన్నాయి. ఈ విజయం మనందరిదీ. ‘మనమంతా శ్రీలంక చరిత్రను కలిసి తిరగరాయబోతున్నాం. సింహళీయులు, తమిళులు, ముస్లింలు.. ప్రత్యేకించి, శ్రీలంక ప్రజల ఐక్యతే శుభారంభానికి పునాది. మనమంతా చేతులు కలిపి మన భవిష్యత్తును రూపుదిద్దుకుందాం’ అని నూతన అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు జేవీపీ పాలనపై కొంత వరకు ఆందోళనలను పోగొట్టింది. ‘ప్రజలు భిన్నమైన రాజకీయ సంస్కృతిని కోరుకున్నారు. శ్రీలంకలో పరిశుద్ధ రాజకీయాలు నెలకొల్పుతాను’ అని అధ్యక్షుడిగా చేసిన మొదటి ప్రసంగంతోనే దిస్సనాయకే ఆకట్టుకున్నారు.

ఐఎంఎఫ్‌తో విక్రమసింఘే కుదుర్చుకున్న 300 కోట్ల డాలర్ల బెయిల్ అవుట్ ఒప్పందాన్ని అనూర మొదటినుంచీ విమర్శించారు. అంతేగాక, తాను అధికారంలోకి వస్తే దాని అమలు తీరును సవరించేలా ఐఎంఎఫ్‌తో మళ్లీ సంప్రదింపులు జరుపుతానని ప్రకటించారు. ఐఎంఎఫ్ సాయం కోసం పాత ప్రభుత్వం తీసుకున్న పొదుపు చర్యల ఫలితంగా జనంపై పన్నుల భారం పడింది. ఐఎంఎఫ్ షరతులు లేదా ఆదేశాలను సవరించి అమలు చేస్తామని జేవీపీ గట్టిగా ప్రకటించిన నేపథ్యంలో కొత్త సర్కారుతో సంప్రదింపులకు సిద్ధమేనని ఐఎంఎఫ్ ప్రకటించింది. ఐఎంఎఫ్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలోని అంశాలకు పూర్తిగా స్వస్తి పలకకుండానే, వాటిని సవరించాలని జేవీపీలో మెజారిటీ నేతలు కోరుతున్నారు.

మొత్తం మీద ఐఎంఎఫ్‌తో కీలక సంప్రదింపులు జరపడంతో పాటు శ్రీలంక దేశీయ ఆర్థిక వ్యవస్థను కాపాడే రీతిలో స్థానిక పారిశ్రామిక, వాణిజ్య రంగాలను ముందుకు నడిపించాలని దిస్సనాయకే పార్టీ యోచిస్తున్నది. స్థానికంగా పారిశ్రామికీకరణను ప్రోత్సహిస్తూ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను బలోపేతం చేయడమే అనూర సర్కారు పంథాగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతేగాక కమ్యూనిస్ట్ నేత స్టాలిన్ పూర్వపు సోవియట్ యూనియన్‌లో, ఫిడెల్ క్యాస్ట్రో నేతృత్వంలో క్యూబాలో దశాబ్దాల క్రితం వచ్చిన విప్లవాల రీతిలో శ్రీలంకలోని మార్క్సిస్టు జేవీపీ సర్కారు నడవదనే అవగాహన ప్రజల్లో ఉంది. ఐరోపా దేశాల కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంటరీ పంథాలో ప్రవేశించాక ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించినట్టే.. శ్రీలంక మార్క్సిస్టు ప్రభుత్వం కూడా ముందుకు సాగుతుందనడంలో సందేహం లేదు. సామ్యవాదం, ప్రజాస్వామ్యం పేరిట సాగిన పాత సర్కార్ల కుహనా విధానాలు అనూర పాలనలో ఉండవనే ఆశే శ్రీలంక ప్రజలను ఈ ఎన్నికల్లో వినూత్న తీర్పు ఇవ్వడానికి ముందుకు ఉరికించింది.

# పునాదుల్లేని ‘స్కిల్’ విద్య!

**రాష్ట్రానికి ఇంకా విద్యా మంత్రి నియామకం జరగలేదు. బీఏ చదివిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ శాఖను నిర్వహిస్తూ.. రోజుకొకటి అన్న తీరులో విద్యా సంస్కరణల ప్రకటన చేస్తున్నారు. రాష్ట్ర విద్యార్థి, యువత ఉపాధి విషయంలో ఆయన ఆలోచనా విధానం పూర్తిగా లోపభూయిష్టంగా ఉన్నది. విద్యావంతులైన యువత వ్యక్తిగత ప్రజ్ఞ, ఆసక్తుల పట్ల శ్రద్ధ, అవగాహన లేకుండా వారందరిని పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేసే వైట్ కాలర్ కూలీలుగా మార్చడమే గొప్ప కార్యమని ఆయన అనుకుంటున్నారు.**



నర్సన్ బద్రి
94401 28169



రాష్ట్రంలో ఒకవైపు లక్షల మంది రైతులు రుణమాఫీ, రైతు భరోసా అందక బాధల్లో ఉన్నారు. ఇలాంటి ఎన్నో ప్రాథమ్యాలను పక్కనబెట్టి ముఖ్యమంత్రి కేవలం నగర అభివృద్ధిపై అద్భుతాలను చెప్తూ స్టేట్ సీఈవోలాగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు సైబరాబాద్ నిర్మిస్తే తాను ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నానన్నారు. వ్యవసాయం దండగ, చరిత్ర చదివితే ఏం లాభమన్న బాబు పోకడలు రేవంత్‌లో పొడ సూపుతున్నాయి. ఫోర్త్ సిటీ గురించి ఘనంగా చెప్తూ న్యూయార్క్, సింగపూర్, దుబాయ్‌లను మించిన నగరంగా దానిని రూపొందిస్తామన్నారు. కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా వృద్ధి పరుస్తామన్నారు. అందులో ప్రముఖ ఫార్మా, ఐటీ కంపెనీలు వెలుస్తాయంటున్నారు. వేల కోట్ల విదేశీ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదంటున్నారు. రేవంత్ కలకంటున్న ఫ్యూచర్ సిటీ వల్ల తెలంగాణలోని సామాన్య ప్రజల కష్టాలు తీరే మార్గాలేవీ లేవు. రైతు కుటుంబంలో నలుగురుంటే ఒకరు వ్యవసాయంలో ఉండి మిగతా ముగ్గురు బయట ఉద్యోగాలు వెతుక్కోవాలన్నారు. పరోక్షంగా సాగును నిరుత్సాహపరిచే తీరు ఈ మాటల్లో కనపడుతున్నది. నగరాల్లోని పరిశ్రమలకు నిరంతరంగా కార్మికుల సరఫరా కోసం వ్యవసాయాన్ని నష్టాల్లో ఉంచాలనే చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయనే మాటలో నిజమే ఉన్నది. వ్యవసాయం కూడా ఆర్థిక చోదకశక్తిగా ఎదగాలని బ్రెజిల్ లాంటి దేశాలు యువతను ఆ వైపు ప్రోత్సహిస్తుంటే మన ఆలోచన మరోలా ఉన్నది.

ఆ తర్వాత స్కిల్ యూనివర్సిటీ గురించి చెప్పుకోవాలి. 57 ఎకరాల్లో రూ.150 కోట్లతో అది నిర్మించబడుతుంది. ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచే ఈ సంస్థకు టెక్ మహేంద్ర అనే ప్రైవేట్ సంస్థ యజమాని ఆనంద్ మహీంద్రా ఛాన్సలర్‌గా ఉంటారు. ప్రభుత్వం కోరి మరీ ఆయన్ని ఆ పీఠంపై కూర్చోబెడుతోంది. వచ్చే ఏడాది 2 వేలతో అడ్మిషన్లు మొదలై క్రమంగా పెరుగుతూ ఏటా 20 వేల మంది విద్యార్థులకు నైపుణ్యం అందించే స్థాయికి అది చేరుతుందని ప్రకటించారు. ఆ చదువులకు ఫీజులు ఎంత, విద్యార్థులకు ప్రభుత్వం నుండి లభించే రాయితీలు ఏమిటో తెలియదు. వీరి నైపుణ్యమంతా ప్రైవేటు కంపెనీలకు ధారపోయవలసిందే. ప్రైవేట్ కంపెనీలు ఇచ్చే జీతభత్యాలు, వాటి విధుల నియమాలు, ఉద్యోగ భద్రతల విషయంలో మాత్రం ప్రభుత్వాలు కల్పించుకోవు. మన కనీస వేతనాలు, పని గంటలు, కార్మిక చట్టాలు ఏ కంపెనీలు పాటించే అవసరం లేదు.

ప్రస్తుతం రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల ద్వారా ఏడాదికి లక్షకు పైగా యువత సాంకేతిక విద్యను పూర్తిచేసుకుంటున్నారు. వారిలో కేవలం 20 శాతం మందికే సరైన ఉద్యోగాలు లభిస్తున్నాయి. మిగతావారిలో నైపుణ్యాల లేమి ఉందని కంపెనీలు చెప్తున్నాయి. ఇందు కు ఆయా ఇంజినీరింగ్ కాలేజీల్లోని బోధన, మౌలిక సదుపాయాల కొరతనే తప్పు పట్టాలి. వాటిపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. లక్ష మందికి నా లుగేండ్ల పాటు కోర్సుకు తగిన నాణ్యమైన విద్యను కచ్చితంగా అందిస్తే వారికి స్కిల్స్ నే ర్పే మరో సంస్థ అవసరమే లేదు. ఈ రకంగా చూస్తే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కేవలం పారిశ్రామికవేత్తల ప్రయోజనం కోసమే అనుకోవాలి.

> **ముఖ్యమంత్రి ఈ మధ్య మరో విచిత్రమైన నైపుణ్య ఆలోచనను ప్రకటించారు. అదే మినీ డిగ్రీ ప్రోగ్రాం. దాని ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఏడాదికి 10 వేల మంది డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో శిక్షణ ఇస్తారు. దీనికోసం ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులను ఐదేసి వేల చొప్పున ఎంపిక చేస్తారు. ఈ శిక్షణ ద్వారా ఆయా విద్యార్థులకు కోర్సు పూర్తికాగానే ఉద్యోగ అవకాశం లభిస్తుందని ప్రభుత్వ తలంపు.**

బీఏ, బీకాం చేసేవారికి ఇది ఉపయోగపడవచ్చు. కానీ, ఒక ప్రత్యేక సాంకేతిక విద్యను అభ్యసించిన వారికి ఈ మినీ డిగ్రీ వల్ల ప్రయోజనం ఉండదు. పని మెళకువలు నేర్చుకున్న యువత ఏదో చేసుకొని బతుకుతారనే ఆలోచన దీర్ఘకాలంలో బెడిసికొడుతుంది. ఒకేరకమైన నైపుణ్యం కలవారి సంఖ్య హద్దు దాటితే వారిలో వారికే పోటీ పెరిగి కంపెనీలు ప్యాకేజీలు తగ్గించే అవకాశం ఉన్నది. కొత్తగా చేరినవారికి కాగ్నిజెంట్ ఏడాదికి రూ.2.5 లక్షల ప్యాకేజీ ఇస్తున్నది. తొందరగా ఉద్యోగం వదిలేస్తే విప్రో రూ.లక్ష జరిమానా వేస్తున్నది. ఇలాంటి వాటిని ప్రభుత్వాలు ప్రశ్నించవు.

ప్రస్తుత కంపెనీలకు, మార్కెట్‌కు అవసరం ఉన్న స్కిల్స్ నేర్పి యువతతో వాటికి చాకిరీ చేయించే కన్నా ఆసక్తి ఉన్నవారిని శాస్త్రపరిశోధనల వైపు మళ్లించాలి. వాటి వల్ల నిత్య జీవితంలోని అనేక సమస్యలు తీరి, మానవాళి అభివృద్ధికి అవి తోడ్పడుతాయి. ముఖ్యమంత్రి నాలుగో నగరాన్ని సింగపూర్‌తో పోల్చారు. సింగపూర్‌లో శాస్త్ర పరిశోధకులు లక్ష జనాభాకు 728 మంది ఉంటే మన దేశంలో 26 మంది ఉన్నారు. ఒక దేశం లేదా నగరం అద్భుత అభివృద్ధిని సాధించాయంటే దాని వెనుక దశాబ్దాల కృషి, శ్రమ ఉంటుంది. దాని దరిదాపులకు వెళ్లాలన్నా ఎంతో అధ్యయనం, సమర్థ మానవశక్తి అవసరం. ఆ అంచనాలేవీ లేకుండానే దాటేస్తాం అనడం ప్రజలను మభ్యపెట్టడమే అనుకోవాలి. విద్య, ఉపాధి రంగాల్లో యువతకు మేలు చేయాలంటే ఒక సమర్థ విద్యామంత్రిని నియమించి, తగిన అధ్యయన కమిటీల ఏర్పాటు జరగాలి. యువత శక్తిని ప్రైవేటురంగానికి బలి చేయకుండా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా ప్రయోజనానికి పనికొచ్చేలా తీర్చిదిద్దాలి.

**మణిపూర్ మండిపోతున్నది. కానీ, అది వార్త కాదు. ఎందుకంటే, వార్త అనేది ఏదో ఒక కొత్తదనాన్ని తీసుకురావాలి. రోజువారీ దినచర్య ముఖ్యాంశం కాదు కదా! ఈశాన్య రాష్ట్రంలో మళ్లీ అల్లర్లు చెలరేగాయి. మరో 10 మందికి పైగా అమాయకులు మరణించారు. వారితో కలిపి మృతుల సంఖ్య 200 దాటింది. మళ్లీ కర్ఫ్యూ కూడా విధించారు. అయినా పరిస్థితులు అదుపులోకి రాలేదు. కాగా, పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని ప్రభుత్వం బుకాయిస్తున్నది.**

# మణిపూర్‌లో మాత్రమే కాదు!



యోగేంద్ర యాదవ్



రెండు తెగల మధ్య జరుగుతున్న అల్లర్లను భద్రతా దళాలు అదుపు చేయలేవని, రాష్ట్ర పోలీసులు మెయితీ, కుకీ వర్గాలుగా విడిపోయారని అసోం రైఫిల్స్ మాజీ అధిపతి గతం లో పేర్కొన్న విషయం విదితమే. అంతర్జాతీయ సరిహద్దుల్లాగా మణిపూర్‌లోనూ అంతర్గతంగా రెండు వర్గాల మధ్య అదృశ్య సరిహద్దు ఏర్పడింది. ఈ సరిహద్దును భద్రతా దళాల అనుమతితో కాదు, మిలిటెంట్ల అనుమతి తీసుకొని దాటాలి. అది కూడా సరిహద్దును దాటేవారు ఏ వర్గానికి చెందినవారనేది నిర్ధారించాకే మిలిటెంట్లు అనుమతిస్తారు. ఎవరైనా అనుకోకుండా అవతలివైపు వెళ్తే మాత్రం వారు తమ ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే.

కుకీల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రవేశించలేని పరిస్థితి. అంతేకాదు, కుకీ ఎమ్మెల్యేలు సైతం అసెంబ్లీ పరిసరాల్లోకి వెళ్లలేని నిస్సహాయ స్థితి. అసలు రాష్ట్రాన్ని పాలిస్తున్నదెవరో ఎవరికీ తెలియడం లేదు. ముఖ్యమంత్రి ఉన్నా లేనట్టే! మణిపూర్‌లో అల్లర్లు చెలరేగిన నాటినుంచీ ప్రధాని మోదీ జపాన్, పపువా న్యూగినీయా, ఆస్ట్రేలియా, అమెరికా, ఈజిప్టు, ఫ్రాన్స్, యూఏఈ, దక్షిణాఫ్రికా, గ్రీస్, ఇండోనేషియా, ఖతార్, భూటాన్, ఇటలీ, రష్యా, ఆస్ట్రియా, పోలండ్, ఉక్రెయిన్, బ్రూనె, సింగపూర్ తదితర దేశాలను సందర్శించారు. కానీ, మణిపూర్‌ను ఎప్పుడు సందర్శిస్తారనే దానిపై ఎలాంటి సమాచారం లేదు.


> **‘ఓ..! అది మణిపూర్ మాత్రమే. దానితో మనకేంటి సంబంధం? అది ముంబై కాదు కదా, కారు ప్రమాదం కూడా వార్తల్లోకి ఎక్కడానికి? ఒకవేళ మణిపూర్‌లో హిందూ-ముస్లిం కోణం ఉండి ఉంటే, ప్రతిపక్షాల పాలనలోని రాష్ట్రమై ఉంటే ‘జంగిల్ రాజ్’ పేరిట హెడ్‌లైన్లకు ఎక్కేది.’**

మణిపూర్‌లో మెయితీ, కుకీ వర్గాలు ఇప్పుడు ఒకరిపై ఒకరు రైఫిళ్లతో మాత్రమే కాల్పులు జరుపుకోవడం లేదు. వాళ్లు అప్‌గ్రేడ య్యారు. ఇటీవల అక్కడ డ్రోన్లు, రాకెట్ లాంచర్లు కూడా వాడినట్టు వార్తలు వచ్చాయి. ఇది వదంతు కాదు, మణిపూర్ పోలీసులు దీన్ని నిర్ధారించారు కూడా. అత్యధికులు హిందువులుగా ఉన్న మెయితీ వర్గంలోని చాలామంది సీఎం బీరేన్‌సింగ్‌పై విశ్వాసాన్ని కోల్పోయారు. మెయితీలకు బీరేన్‌సింగ్ మద్దతిస్తున్నాడని కుకీలు ఆరోపించారు. అంతేకాదు, ఆయనను నిషేధించారు కూడా. మెయితీల హీరోగా మారేందుకు దాన్ని బీరేన్‌సింగ్ వాడుకున్నారు.

కనీస సమాచారం లేకుండానే ఇప్పుడు మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగుతున్నది. శాంతిభద్రతలను తిరిగి తనకు అప్పగించాలని కోరుతూ గవర్నర్‌కు స్వయంగా సీఎం బీరేన్‌సింగ్ లేఖ రాశారు. అవును..! ఆయన రాజ్యాంగం తనకు ఇచ్చిన అధికారాలను తిరిగివ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం కేంద్రం నియమించిన భద్రతా సలహాదారు చేతుల్లో శాంతిభద్రతలున్నాయి. ఈ కాల్పులు, అల్లర్లు విపక్ష పార్టీ పాలిత రాష్ట్రంలో జరిగినట్టు ఒక్కసారి ఊహించుకోండి! ఇది భారీ కుంభకోణం కాదా? జాతీయ భద్రతకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా వైఫల్యంపై మనం మాట్లాడగలమా? అది వార్త అవుతుందా?

మొత్తానికి మణిపూర్ మాట్లాడటం ప్రారంభించడం శుభపరిణామం. మణిపూర్ లోయ ఎంపీ బిమోల్ అకోయిజమ్ పార్లమెంట్‌లో చారిత్రాత్మక ప్రసంగం చేశారు. నేను మరో కథనం చెప్పనా? ఇది మణిపూర్ గురించి కాదు.. ఢిల్లీ కఠినమైన హృదయం గురించి, దేశంలో ఆవరించిన నిశ్శబ్దం గురించి, మన హృదయాలను కమ్మేసిన చీకట్ల గురించి. మండిపోతున్నది మణిపూర్ మాత్రమే కాదు.. మన కలల భారతం, చిన్నప్పటినుంచి మనం వింటూ పెరిగిన ‘సారే జహాసే అచ్ఛా హిందుస్థాన్ హమారా...’

(‘నేషనల్ హెరాల్డ్’ సౌజన్యంతో..)




## “ శాండ్‌విచ్‌లా నలిగిపోవాలనుకోవట్లేదు!



మల్టీపోలార్ వ్యవస్థలో చాలా పవర్ క్యాంపులున్నాయి. ఆ భౌగోళిక రాజకీయ పోరులో మేం భాగం కాము. మాకు ఎవరితోనూ సంబంధం లేదు. అంతేకాదు, మేం (శ్రీలంక) శాండ్‌విచ్‌లా నగిలిపోవాలని అనుకోవట్లేదు, ప్రత్యేకించి చైనా, భారత్‌ల మధ్య. ఆ రెండూ మాకు మిత్రదేశాలే. వారి నుంచి మేం మైత్రినే ఆశిస్తున్నాం.

- అనూరకుమార దిస్సనాయకే, శ్రీలంక అధ్యక్షుడు